పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ
- షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా 56 మంది లబ్ధిదారులకు రూ.56.6 లక్షల చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. నిరుపేదల ఆడబిడ్డల వివాహాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకం ద్వారా ఆదుకోవటం సంతోషించదగ్గ విషయమన్నారు. పేదింటి వారి ఇళ్లల్లో సంతోషంగా ఆడపిల్లల వివాహం జరగాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెటినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశీనాథ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, ఎల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా సభ్యత్వాన్ని తీసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ప్రతి మహిళా అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వాన్ని తీసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40 వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో పార్టీ మహిళా నాయకురాళ్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సమ్మారెడ్డి, దుర్గారాణి, రాజ్యలక్ష్మి, మధులత, అరుణ, సౌందర్య, షేక్ బీబీ, స్వరూప, పుట్టం దేవి, పద్మ, కృష్ణవేణి, శ్యామల, వల్లి రమణ, శ్రీలత, లక్ష్మి, నాగలక్ష్మి, సరిత పాల్గొన్నారు.



మహిళలతో సభ్యత్వం చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మోతీనగర్: వయస్సు పైబడిన వారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్ అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీ మోతీనగర్, స్నేహపురి కాలనీలోని బడ్స్ అండ్ బ్లూమ్స్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య పరీక్షలను అపోలో సౌజన్యంతో నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతి ప్రియ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులతో పాటు తులం బంగారం అందజేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు

కేపీహెచ్‌బీకాలనీ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తులం బంగారం అందజేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీలోని తహసిల్దార్ కార్యాలయంలో కార్పొరేటర్‌లు సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, శిరీష, తహసిల్దార్ స్వామితో కలిసి శుక్రవారం 210 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లి ఖర్చుల నిమిత్తం కేసీఆర్ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. అదే విధంగా చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో ఇచ్చే విధంగా కలెక్టర్, తహసిల్దార్ చర్యలు తీసుకోవాలన్నారు.

'మనూ'లో విద్యార్థుల ఆందోళన

రాయదుర్గం: హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలని మనూలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు తల్హామన్నన్ మాట్లాడుతూ మెస్‌లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. తాము ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఎన్నికల వాయిదాపై ఆగ్రహం..

విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో విద్యార్థి సంఘం ఎన్నికలను అధికారులు రద్దు చేశారు.దీనిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి నిర్వహించాలని కోరారు. ఇదిలావుండగా విద్యార్థుల నిరసన నేపథ్యంలో పోలీసులు ప్రధాన గేటు వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి బయటి వారు లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు




అండర్ 17 బాలికల విభాగంలో ప్రథమ బహుమతి పొందిన సంఘమిత్ర హై స్కూల్ విద్యార్థులు

కూకట్‌పల్లి: ఎస్ఎస్‌కేకే హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. అండర్ 14 విభాగం బాలికల విభాగంలో విన్నర్‌గా గ్లోబల్ మోడల్ స్కూల్ ప్రథమ, సదాశివ స్కూల్ ద్వితీయ బహుమతి పొందారు. అండర్ 17 విభాగంలో ప్రథమ బహుమతి సంఘమిత్ర హైస్కూల్, ద్వితీయ స్థానం సదా శివ స్కూల్ విద్యార్థులు పొందారు. అండర్ 17 విభాగం బాలుర విభాగంలో ప్రథమ బహుమతి మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాల, ద్వితీయ బహుమతి గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు పొందారు. అండర్ 14 విభాగంలో ప్రథమ బహుమతి మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే స్కూలు విద్యార్థులు, ద్వితీయ బహుమతి కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూలు విద్యార్థులు పొందారు. గెలుపొందిన విద్యార్థులకు జోనల్ కార్యదర్శి బి.యాదయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రవీందర్ మూసాపేట, సరోజ శంషాబాద్, శ్వేతా జడ్పీహెచ్ఎస్ కూకట్‌పల్లి, ప్రభుత్వ పీడీ పీటీలు పాల్గొన్నారు.



అండర్ 17 బాయ్స్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందిన గ్లోబల్ మోడల్ స్కూల్

అటకెక్కిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణ?



- నిధుల కొరతతో కునారిల్లుతున్న హెల్త్ సెంటర్లు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణకు హెచ్‌డీఎస్ కింద ఏటా రూ. 1.75 లక్షలకు బ్రేక్
- ఏడాదికి జిల్లాలోని 38 ఆరోగ్య కేంద్రాలకు రావలసిన నిధులు రూ. 66.55 లక్షలు
- 2 ఏళ్లుగా నిధులు రాకపోవటం రోగులకు తప్పని ఇబ్బందులు

సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లుగా నిధుల లేమితో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఆటకెక్కింది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు ప్రతి ఏటా హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 1.75 లక్షలు అందజేసేది. ఈ నిధులు రెండేళ్లుగా విడుదల కాక పోవటంతో ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటిలో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలన్నింటిల్లోనూ నిధుల లేమితో నిర్వహణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస వసతులు కల్పించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇన్‌పేషంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూత్రశాల, మరుగు దొడ్లను పరిశీలించారు. హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ) నిధులు రావటం లేదనే నెపంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ సక్రమంగా లేదని తెలుసుకున్నారు.

కలెక్టర్ అసంతృప్తి..

ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తీరుపై జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉందనడంలో అతిశయోక్తిలేదు. వివిధ రకాల పరీక్షల కోసం బయటికి రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండీ లాభమేంటనే ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

- హెచ్ఎస్ నిధులు విడుదల కాకపోవటం వల్లనే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు.
- ఈ విషయమై పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావటం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- నిర్వహణ నిధులు విడుదల రాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస వసతుల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొంటున్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో సీనియర్ సిటిజన్ భవనంలో ఆదివారం ఉచిత మెగా నేత్ర కంటి వైద్య శిబిరం నిర్వహించనునున్నట్లు సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ మాధవిస్ కంటి ఆసుపత్రి, గాయత్రినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఇందులో 'బీయింగ్ అసెర్టివ్' అనే అంశంపై అమెరికాకు చెందిన బిహేవియర్ థెరపిస్ట్ బికే హర్ష ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 400 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం కూకట్‌పల్లి మండల కార్యాలయంలో లబ్ధిదారులకు అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు పథకాల అమలులో ప్రొటోకాల్ అంటూ అధికారులను బెదిరిస్తున్నారని, అలాంటి వ్యక్తులకు అధికారులు ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎవరికీ కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, మేకల రమేష్, ప్రవీణ్, కృష్ణారాజ్‌పుత్, మధుగౌడ్, సతీష్ గౌడ్, శివ చౌదరి, బచ్చు మల్లి, మాధురి, రాము, నరసింహ, జ్యోతి, వనజ, సంధ్య పాల్గొన్నారు.

ఎస్కీలో 'ఏక్ పేడ్ మా కే నామ్'



ఎస్కీ'లో మొక్క నాటుతున్న డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో అవసరమని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కీ ప్రాంగణంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెజాన్ అడవుల్లోని చెట్లు ప్రపంచంలోని 20 శాతం మందికి ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. అందుకే అమెజాన్ అడవులను లంగ్స్ ఆఫ్ ది ఎర్త్ అంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ లక్ష్మీకాంతరావు, సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ ఆదినారాయణరావు, అధికారులు కెజే అమరనాథ్, డాక్టర్ కృష్ణప్రసాదరావు, అనితఅగర్వాల్, విద్యాసాగర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, నరేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ తన చావుకు తానే కారణమంటూ రేఖ రాసి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుమన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగోలు ప్రాంతానికి చెందిన ఆకుల సత్యనారాయణ కుమార్తె ఆకుల స్నేహ (34) ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. రెండు సార్లు వివాహం జరిగినా మనస్పర్థలతో విడిపోయింది. మూడు నెలల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వచ్చిన స్నేహ కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ లేడీస్ హాస్టల్‌లో నివాసం ఉంటూ స్థానికంగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శుక్రవారం తెల్లవారుజామున హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోయేందుకు 17 ఏళ్లుగా యత్నించా...

జీవితంపై విరక్తి చెందిన స్నేహ 17 ఏళ్లుగా చనిపోయేందుకు యత్నించినట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొనడం గమనార్హం. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని తానే బాధ్యురాలినని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

గౌలిదొడ్డి గురుకుల పాఠశాల/ కళాశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల/పాఠశాలల్లో డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గౌలిదొడ్డిలోని బాలికల కళాశాల/పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్–సీఓఈ గురుకులాల భద్రత–తల్లిదండ్రుల బాధ్యత' అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకులాల్లో ఇప్పటి వరకు కొనసాగిన కాంట్రాక్టు ఉపాధ్యాయులను కొనసాగించడంతోపాటు నెలవారీగా వారికి వేతనాలు అందించాలని, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో 8 ఏళ్లుగా కొనసాగుతున్న సబ్జెక్ట్ అసోసియేట్స్‌ను తొలగించడం న్యాయం కాదన్నారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారికి అనుభవం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో నిరసన తెలపాలని తల్లిదండ్రులు ప్రయత్నించగా పోలీసులు వారిని వారించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి, వినతిపత్రం అందించి వెళ్లేలా ఒప్పించారు. అనంతరం తల్లిదండ్రులు డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్ కల్పనకు అందజేశారు.



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్ద నిరసనలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



టెంపుల్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేసిన ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ ముత్తు, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, నాయకుడు శేరి సతీష్ రెడ్డి తదితరులు -కూకట్‌పల్లి



ఇందిరాగాంధీ పురంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేసిన బండి రమేష్ తదితరులు -కూకట్‌పల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మూసాపేట: ముస్కిపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, కై త్లాపూర్ ప్రాంతాల్లో, 11 నుంచి 11:30 గంటల వరకు మూసాపేట హనుమాన్ జంక్షన్, హబీబ్‌నగర్, పవర్ నగర్ ప్రాంతాల్లో, 11:30 నుంచి 12 గంటల వరకు వివేక్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆరోగ్యశ్రీ ఈకేవైసీ ప్రక్రియ పరిశీలన



ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం పీజేఆర్ నగర్‌లోని మొగులమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు ఈకేవైసీ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం ఎంతో మంది పేదలకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, జి. రవి. సీహెచ్. భాస్కర్, పోశెట్టి గౌడ్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, వాలి నాగేశ్వర రావు, పుట్టం దేవి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కొండాపూర్ డివిజన్ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు

మోతీనగర్: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి జేఏసీ కృషి చేస్తుందని కొండాపూర్ డివిజన్ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్స్ జేఏసీ చైర్మన్ శ్రీను అన్నారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ ఆర్టిజన్స్ కన్వర్షన్స్ కార్మికుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా కె. శ్రీను, కో కన్వీనర్‌గా మాణిక్‌రెడ్డి, సభ్యులుగా రమణ, మల్లేష్, లక్ష్మణ్, రాజేష్, సోమేశ్వరరావు, నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చైర్మన్ తెలిపారు.